# ప్రణయంలో కల్పన

కథానిక

ఉమాదేవి

సాయంత్రం అలవాటు ప్రకారం ప్రొఫెసర్ రాజశేఖరంగారు సముద్ర తీరానికి షికారుగా నడిచివెళ్ళారు. ఓ గంటసేపలా అలా తిరిగి కనుచీకటి పడబోయే ముందు యింటికి బయలుదేరారు. దగ్గర దగ్గర ఏభైయోపడి సమీపిస్తున్నా క్రమబద్ధమైన వ్యాయామంవల్ల గట్టిపడ్డ కాయపారు శరీరంతో, నలభైలోపు మనిషిలా కనుపిస్తారాయన. దానికి తగ్గట్టు తళతళా మెరసిపోయే పచ్చని దేహకాంతీ, ఏమాత్రం తెలుపు తిరగని జుట్టూ, దృఢమైన దేహం మూలాన చూపరులకు యీయన కాలం నాడు యింకెంత ఆకర్షణీయంగా ఉండేవారా అనిపిస్తుంది.

ఏదో యింగ్లీషు ట్యూను హంచేసుకుంటూ చకచకా గేటుదాటి బంగళాలోనికి అడుగు పెట్టబోయేముందు నౌకరు ఎదురుగా వచ్చాడు.

"బాబయ్యా! ఎవరో మీ కోసం వచ్చారండీ. డ్రాయింగు రూములో కూర్చున్నారు" అన్నాడు సవినయంగా.

"అలాగా..." అంటూ హుందాతనం ఉట్టిపడేలా తల పంకించి డ్రాయింగు రూములోకి అడుగు పెట్టారు.

వారి జోళ్ళు అక్కడే వదిలి లోపలకు వెళ్ళి వచ్చినవ్యక్తి చేసిన అభివాదానికి ప్రత్యభివాదం చేసి ఫేనువేసి ఎదురుగుండా కూర్చున్నారు రాజశేఖరంగారు.

ఆయనెందుకు వచ్చాడో వీరికి తెలియటంలేదు.

వచ్చిన విషయం ఎలా బైట పెట్టాలో ఆయనకు తోచటంలేదు.

కొంత సేపటికి ప్రొఫెసరుగారే "మీరు..." అనబోయేసరికి "కల్పన తండ్రినండి. నా పేరు గోపాలరావు. డన్‌లప్ కంపెనీలో మేనేజరుగా పని చేస్తున్నాను" అన్నాడా ఆగంతుకుడు.

"అలాగా! చాలా సంతోషమండీ మిమ్మల్ని కలుసుకున్నందుకు. ఇంతకూ నాతో ఏం పనిమీద వచ్చారన్నారు?" అన్నారు సౌమ్యంగా.

"కల్పన విషయమై కొద్దిగా మాట్లాడాలని."

"కల్పన కేమండీ తెలివైన పిల్ల. అన్నిట్లోనూ చురుకుగా ఉంటుంది. ఈయేడు ఆమె యూనివర్సిటీ ఫస్టు వస్తుందని అంతా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాము కూడా."

"అది కాదండి... ఆమె ప్రవర్తన—"

"చ్చ చ్చ—చిన్నతనం కాబట్టి కాస్త పెంకిగా ఉంటుందేమో. ఆపాటి చిలిపితనం వస్తుతః లేకపోయినా కాలేజికి వచ్చి నలుగుర్నీ చూస్తుంటేనయినా కలుగుతుంది. అదేమంత ప్రమాదకరం ఏమీ కాదనుకోండి."

"ఇవేమీ కాదుసార్. ఆమె వివాహం విషయంలోనే వచ్చింది పేచీ అంతా."

"ఓస్... అదా... అందులో నన్ను సంప్రదించేందు కేముంది?... ఒకవేళ కాలేజీలో ఎవరినైనా ప్రేమించిందంటారా?" సందేహిస్తూనే అడిగారు రాజశేఖరంగారు.

"ఎవరితో సంబంధించినదైతే మీదాకా రాకపోదును. ఇప్పుడు కల్పన మిమ్మల్నే ప్రేమించిందిట — మరెవరినీ చేసుకోనంటోంది!"

ఎదురుగుండా పిడుగుపడ్డా అంతగా నిశ్చేష్టుడవడు రాజశేఖరంగారు.

ఎదురు చూడని యీ హఠాత్పరిణామానికి ఆయన విస్మయానికి అవధిలేదు. నోటమాట లేకుండా కళ్లు తెరుచుకొని అలాగే చూస్తూ కూర్చుండిపోయారు...

"నన్నా!..." ఆయనకు నవ్వాలో ఏడవాలో—మరేమనాలో కూడా తోచటంలేదు.

"ఆ పిల్లకు తప్పకుండా మతి కాస్త చలించి ఉండాలి." కాస్త తేలిక చేసుకుని నవ్వేయటానికి ప్రయత్నించారు.

"మేమూ అదే అనుకున్నాం లెండి. కాని అలాంటి లక్షణాలు యితరత్రా మరేమీ లేవు. ఎంతో శ్రమపడి కుదిర్చిన మంచి సంబంధం వద్దు పొమ్మంది. ఆమెతో వాదించి గెలవలేమన్న విషయం మాకు ఎప్పుడూ అనుభవంలోనిదే."

"ఎంతపని చేసిందీ కల్పన!" అని నొచ్చుకున్నారు రాజశేఖరంగారు.

"ఈ సమయంలో ఏమిచేయటానికీ పాలుపోవటంలేదు ప్రొఫెసరుగారూ! మీకు తెలుసో లేదోగాని మా కల్పన మహా పెంకిపిల్ల. తనపట్టు ఎలాగైనా నెగ్గించుకుతీరాలనుకునే వ్యక్తి. చిన్నప్పటినుంచీ అంతే అనుకోండి. అల్లారుముద్దుగా పెంచి యీడూజోడూ అయిన భర్తను తెచ్చి యివ్వాలని మేమెంతో ఉబలాటపడి ఎంతో ప్రయత్నంమీద ఆ బారిష్టరుగారబ్బాయిని ఆకు వేలకు ఖాయపరచుకునేసరికి తాతలు దిగొచ్చారంటే నమ్మండి! ఇప్పుడీపిల్ల కాదంటే వాళ్ళముందు మా పరువు నిలిచేనా? అదికాక చూచేవాళ్లేమనుకుంటారు చెప్పండి? డబ్బుకు కక్కుర్తిపడి యీ గోపాలరావు కన్న కూతుర్ని అన్యాయంచేసి యీడుమించిన సంబంధానికి యిచ్చాడని నన్ను నానామాటలూ అనరుటండీ! ఇదంతాచూచి తల్లి దిగాలుపడి కూచుంది. మాఅబ్బాయికెటూ పాలుపోవటంలేదు. చెల్లెలంటే వాడు భయపడాల్సిందేగాని అన్నగారంటే దానికేనాడూ భయంలేదు. ఇలాంటి పరిస్థితిలో నేనేకాదు ఎవడుమటుకు ఏం చేయగలడు చెప్పండీ!" అన్నాడు ఆవేదనతో, ఆవేశంతో-ప్రాధేయపూర్వకమైన కంఠస్వరంతో.

"కాదుటండీ మరి! కాకపోయినా యీపిల్లకిదేం దుర్బుద్ధిట! నేనేం కుర్రవాణ్ణనుకుంటోందేమో. మా అబ్బాయికే పాతికేళ్ళు వచ్చాయి. మీకు తెలుసో తెలీదో మా విష్ణు ఇంగ్లండువెళ్ళి రెండేళ్ళయింది పోస్టుగ్రాడ్యుయేటు కోర్సుకి. యీ నెలలో రాబోతున్నాడుకూడా. రాగానే వాడికి తగిన పిల్లనుచూచి పెళ్ళిచేయాలనుకుంటున్నా. పదిహేనేళ్ళనుంచీ లేనిది నాకు పెళ్ళేమిటిప్పుడు? చిత్రమైన పిల్లే...ఇంతకూ నన్నేం చేయమంటారు చెప్పండి?" కలుపుగోలుగా అడిగారు రాజశేఖరంగారు.

"కాస్త మా పిల్లకు యిది నీకు తగదని నచ్చజెప్పండి..."

"సరే. రేపు సాయంత్రం మీ బసకు రమ్మంటారా?"

"సాయంత్రందాకా దేనికి? రేపు ఉదయమే రండి. మీమేలు ఎన్నటికీ మరువను" అని లేచి తన బసఅడ్రసు రాసియిచ్చి నమస్కారంచేసి వెళ్ళిపోయాడు గోపాలరావు.

ఆయన వెళ్ళిన దిక్కుకేచూస్తూ కూర్చున్న రాజశేఖరంగారికి జాలేసింది ఈ విచిత్ర సన్నివేశానికి. ఆయన కాస్త ప్లేటర్ అవకపోలేదు. ఈ వయసులో తనను ఓ పద్ధెనిమిదేళ్ళ నవయవ్వన సుందరాంగి ప్రేమించటం — అందులోనూ అన్ని విధాలా వాంఛనీయమైన యువకులను కాదని తన్నే వరించిందంటే ఆయనకే ఏమిటో యిదిగా ఉంది మరి...

రాజశేఖరంగారు ప్రొఫెసరయిన ఏడాదికే భార్య శ్యామలాంబ రెండోకూతుర్ని కని బాలింత జబ్బుతో పోయింది. అప్పటికి కొడుకు విష్ణు ఏడేళ్ళవాడు. పెద్దమ్మాయి లలితకు మూడో ఏడు. పసిపిల్లలను ఆయన చెల్లెలికి పిల్లలులేక ఆపేక్షపడి అడిగితే లలితనుకూడా ఆమెకే వప్పజెప్పి నెలకోవంద రూపాయలు ఖర్చులకుగాను యిచ్చేవాడు. విష్ణుని కాన్వెంటులోనే చేర్పేశాడు. ఒక ఆరునెలలపాటు సెలవుపెట్టి దేశమంతా వెర్రెత్తినట్లు తిరిగివచ్చాడు. మనశ్శాంతికి ఎక్కడికో పోనక్కర్లేదనీ, మనస్సు నిబ్బరం చేసుకోటంలోనే ఉందనీ గ్రహించాడు...తన వృత్తిలో పూర్తిగా లీనమయిపోయాడు. యూనివర్శిటీవారే ఒకసారి

ఆయన్ను ఓ ఏడాదిపాటు ఇంగ్లండు పంపారు పై చదువులకు. తిరిగి వచ్చాక యీ పదిహేనేళ్ళ బట్టీ అలాగే ఉద్యోగంచేస్తూ ఆడూళ్ళో చక్కని బంగళా కట్టించుకున్నాడు. పదిహేను వేలకు యిన్సూర్ చేశాడు. పదిహేనెకరాల మామిడి తోటా, పదెకరాల మాగాణీ ఆర్జించారు. ఇద్దరాడపిల్లలనీ స్కూలు ఫైనలుతోనే చదువు మానిపించి యోగ్యులైన వారికిచ్చి పెళ్ళిచేశారు. చిన్నపిల్ల కాపరానికి వెళ్ళికూడా రెండేళ్ళయింది. ఇక విష్ణేమో ఇంజనీరింగు పూర్తిచేసి పైకోర్సుకి ఇంగ్లండు స్కాలర్‌షిప్‌మీదే వెళ్ళాడు. సంక్షిప్తంగా యిదీ రాజశేఖరంగారి కుటుంబపరిస్థితి.

ఇక యూనివర్సిటీలో ఆయన గణితంలో హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్. ఎంత చిక్కు సమస్యనైనా యిట్టే విప్పటంలో ఆయనకు ఆయనే సాటి! పేరుకు గణితమనేకాని ఆయన విజ్ఞానం అపారం. ఆయనకు తెలియని విషయంలేదు. చర్చించలేని శాస్త్రంలేదు...అందుకే ఫిలాసఫీ స్టూడెంట్సు దగ్గరనుంచి జియాలజీ వాళ్ళదాకా ఆయనంటే యిష్టపడతారు. మరి ఆయన స్టూడెంట్సుకి ఆయన ఆరాధ్యదైవమే!...కల్పనకూడా ఆయన స్టూడెంట్ అవటాన ఆమెకూడా ఆయన ప్రతిభావిశేషాలకు ముగ్ధురాలయిందంటే ఆశ్చర్యమేముంది? కాని ఆ ఎడ్మిరేషన్ అంతటితోనే ఆగుతుందనుకుంటూనుగాని యిందాకా వస్తుందని ఆయన మటుకూ ఎలా అనుకుంటారు!

థియరీఆఫ్‌నంబర్స్ చెపుతున్నా, డైనమిక్స్ గాని, హైడ్రోస్టాటిక్స్‌గాని చెపుతోంటే, ప్యూర్ జామెట్రీలోనో ఏ సాలిడ్స్‌గురించో తెలియశేదన్నా ఆయన ముఖతః వినాల్సిందే! అందరూ డ్రైగా తలచి భయపడివైదొలగే శాస్త్రాన్ని అంత రొమాంటిక్‌గా ఆయన చెపుతోంటే 'జన్మఎత్తాక గణితశాస్త్రం అభ్యసించకపోతే ఆ జన్మ వ్యర్థమే" "తింటె గారెలు తినాలి — నేర్చుకుంటే గణితమే నేర్వాలి" అనుకునేవారు విద్యార్థులు ... వీరి అదృష్టానికి—అంటే రాజశేఖరంగారి విద్యార్థులయే అదృష్టం పట్టిన గణితశాస్త్ర విద్యార్థులను చూచి మిగిలినవారు అసూయాగ్రస్తులయేవారు. అందరు విద్యార్థుల ప్రేమానురాగాలు, తోటి అధ్యాపకుల గౌరవమన్ననలు పొందిన రాజశేఖరంగారికి జీవితంలో యింతకంటె కోరదగ్గ సౌఖ్యాలేవీ ఉంటాయంటేగూడా నమ్మకంలేదు.

ఇంతలో యీ విచిత్ర సంఘటనా!

కల్పనని తలచుకుని కాసేపు అబ్బురం చెందారు. తమలపాకులాంటి ఆ పద్ధెనిమిదేళ్ళ చిలిపిపిల్ల—ఎప్పుడూ "మేష్టారూ! మేష్టారూ" అంటూ కాలేజీలో ఏవో సందేహాలతో ఉక్కిరి బిక్కిరి చేసే చిన్నారి—ఆమె హృదిలో యింత లోతైన ఊహాలున్నాయా! రేపు ఎలా మాట్లాడాలో ఊహించుకుంటూ రాత్రి ఫలహారానికి వెళ్ళారు రాజశేఖరంగారు.

• • •

మరునాటి ఉదయం ఎనిమిది గంటలకు అన్నమాట ప్రకారం రాజశేఖరంగారు గోపాలరావుగారి బసకు వచ్చారు. ముందు గదిలో కూర్చోపెట్టాడు గోపాలరావు. నదురూబెదురూ లేకుండా కల్పన బైటికి వచ్చింది.

"అమ్మాయీ, ప్రొఫెసరుగారొచ్చారు. కాఫీ తీసుకురామ్మా" అని పురమాయించాడు గోపాలరావు.

రాజశేఖరంగారికి నమస్కారం చెప్పి కల్పన, "వారు కాఫీ తాగరు నాన్నా. నారింజరసం తీసుకువస్తాను" అంటూ లోపలికి వెళ్ళి పళ్ళరసం రెండు గ్లాసులతో తీసుకువచ్చి రాజశేఖరంగారి కొకటీ, తండ్రి కొకటీ అందిచ్చింది. తన అలవాట్లన్నీ ఎలా గ్రహించిందా యీ పిల్ల అనుకుంటూ ఆశ్చర్యంతో తల మునకలు అవుతూనే ప్రొఫెసరుగారు జూస్ తాగారు.

గోపాలరావుగారు లేచి రాజశేఖరంగారికి కనుసైగ చేస్తూ "నాకు కాస్త పని ఉంది. అలా వెళ్ళి వస్తానండీ మీరు కల్పనతో మాట్లాడుతూ ఉండండి" అంటూ బైటికి వెళ్ళిపోయాడు.

ఈ తతంగమంతా ముందే గ్రహించినదానిలాగా నిర్భయంగా, నిస్సంకోచంగా కల్పన వచ్చి రాజశేఖరంగారి ముందు కుర్చీలో కూర్చుంది. ఆమె ధైర్యంచూచి ప్రొఫెసరుగారే కాస్త కంగారు పడ్డారు. ఎలా మాట్లాడాలో తోచక తికమక పడేసమయంలో కల్పనే అందుకుంది.

"ఏమండీ మేష్టారూ? మా నాన్న మిమ్మల్ని వచ్చి నాకు హితబోధ చేయమన్నట్లున్నాడు

కదూ. నాకు తెలుసు లెండి...మరి ఊరుకున్నారేం? మొదలుపెట్టండి!" అంది కొంటెగా, కాలేజీలో ప్రశ్నలు వేసే ధోరణిలోనే. ఆమె కంఠంలో తన విషయం తెలిసిపోయిందేమో అనే జంకుగాని, ఆ కళ్ళల్లో ఎదటి వ్యక్తిని సూటిగా చూడనీయకుండా చేసే లజ్జగాని ఏమాత్రం లేవు. ఆమెకు బదులు రాజశేఖరంగారే సిగ్గుపడుతున్నారు. చివరికి ఎలాగో మొదలుపెట్టారు.

"చూడమ్మాయీ కల్పనా"—మనుమరాలిని పలకరించే ధోరణిలో మొదలెట్టారు.

"ఏమిటండీ మేష్టారూ?" ఎంతో వినయంగా బుద్ధిమంతురాలిలా అడిగింది.

"నాకు ఎంత వయసనుకుంటున్నావో ఏమో-ఏభై వెళ్ళిపోతోంది తెలుసా?" బెదిరిస్తున్నట్లు చెప్పారు.

"ఇది కూడా తెలియదుటండీ మాకు!" తీరిగ్గా నవ్వుతూ అంది కల్పన.

"నాకు నీకంటే పెద్దమ్మాయిలిద్దరు కూతుళ్ళున్నారు కాపరాలు చేస్తూ. నిన్ను చేసుకోటానికి యీడైన కొడుకు యింగ్లండులో చదువుకుంటున్నాడు. ఈ నెలలోనే రావాలి వాడూనూ. నన్ను చూచి పడుచువాడనుకుంటున్నావు కాబోలు" అన్నారు-ఆమె రియాక్షనెలా ఉంటుందో ఓరకంట కనిపెడుతూ.

కొంచెం చిరాకుతో "అవన్నీ దేనికండి మేష్టారూ? మీకు కూతుళ్ళున్న సంగతి నాకు తెలియదంటారా? మీ విష్ణువర్ధనరావు సంగతి ఎరగనంటారా?" అంది కల్పన.

"అహ-అది కాదు. నీవేదో గొడవ చేస్తున్నావట యింట్లో. కాలేజీలో యిందరు ఈడూ జోడైన వాళ్లు అటు విద్యార్థులూ ఇటు ఉపాధ్యాయులూ కూడా ఉండగా వృద్ధాప్యంలో అడుగుపెట్టిన నన్నెలా వరించావా అని సందేహంలో పడ్డానులే" అన్నారు కాస్త 'అనీజీగా' ఫీలవుతూ.

"దానికేముంది లెండి. ఈడూ జోడూ అయిన వాళ్ళు ఎక్కడబట్టినా దొరుకుతారు. మీ వంటి విజానఖనులున్నారు చూశారూ—వాళ్లు కనిపించరసలు. కనిపించినా అందటానికి వీలులేని స్థితిలోనే ఉంటారు. మీలాగా వివాహానికి అన్ని విధాలా అనుకూలంగా, యోగ్యంగా దొరకరు."

రాజశేఖరంగారు యీ మాటకు మరింత ఆశ్చర్యపోయారు. కల్పన యింతగా తెగించి మాట్లాడగలుగుతుందనుకోలేదాయన.

"వివాహానికి అనుకూలంగా కనిపిస్తున్నానా యీ వయసులో!"

కాస్త లోలోపల మురిసిపోతూ పైకి ఆశ్చర్యాన్నే మరింత వెల్లడిస్తూ అన్నారు.

"కాదూమరి. మీకే భార్య ఉంటే మిమ్మల్నెంత ఎడ్మైర్ చేసినా పెళ్ళాడటానికి వీలుండేదా? అంతేకాక పూర్తిగా వార్ధక్యం ఆవరించి ఉన్నా ఎలా ఉండేదో..."

"బాగుంది - నీకంటికి పాతికేళ్ళ యువకుడిలా కనుపిస్తున్నా నన్నమాట!" తృప్తిగా నవ్వుకున్నారు తనలో తను.

"పోనీ ఓ పని చేస్తావూ? నీకు నేనంటే ఇష్టంలా ఉందికదా—మా అబ్బాయిని చేసుకోరాదూ? మీ నాన్నకు ఆరువేల ఖర్చు తప్పుతుంది. అటు నాదగ్గరే మీరిద్దరూ ఉంటారు. మా విష్ణు అంతా నా పోలికే. చిన్నతనం మూలాన యింకా ఆకర్షణీయంగాకూడా ఉంటాడు. ఏం?" అన్నారు ఆమె మనసులోని విషయం పూర్తిగా రాబట్టే సంకల్పంతో.

కల్పన దెబ్బతిన్నట్టు బాధగా, రోషంగా చూచింది. మొహం కెంపువారింది. "మేష్టారూ—నేను ఆకర్షణలకు ప్రాధాన్యతనిచ్చే మనిషినే ఐతే మీ అబ్బాయిదాకా దేనికీ—ఆ బారిష్టరుగారబ్బాయి మీవాడికంటె చాలా అందంగా ఉంటాడు. తెలివి తేటలలో మీకుర్రాడికేమాత్రం తీసిపోడు కూడా—ఇంకా చాలామందే ఉన్నారు అలాంటి యువకులు — ఏలంటారా? మా నాన్న ఆస్తికి నేనూ మా అన్నా సమాన భాగస్థులమే. కాబట్టి మా యిద్దరికీ చెరో ఏడెనిమిదివేలు ఎలాగా ఎప్పటికైనా వచ్చేవేకదా. మీ విజ్ఞానానికి ముగ్ధురాలనయ్యాననే మళ్ళీ ఓసారి జ్ఞప్తి చేస్తున్నాను" అంది తీవ్రంగా.

"బాగుందమ్మా కల్పనా! నేను స్వతంత్రుణ్ణనుకుంటున్నావు కాబోలు. ఈ వయసులో పెళ్లాడానంటే నా పిల్లలేమనుకుంటారు? ఆస్తిలో పరాయి వ్యక్తికికూడా వాటా పోతుందంటే వాళ్ళు బాధ

కడరూ? ఇన్నేళ్లు వచ్చాక కామం కన్నుగప్పిందని పిల్ల లేకాకుండా నలుగురూ నానామాటలనరూ?"

"చక్కని సందేహమే వెలిబుచ్చారు మేష్టారూ! మీ ఆస్తి కోసం కాదుగా నేను మిమ్మల్ని పెళ్ళాడాలనుకుంటోంది. ఒక్కొక్కరి ప్రత్యేకత ఒక్కొక్కర్ని ఆకర్షిస్తుంది. నెహ్రూజీని పెళ్ళాడాలనుకునే అమ్మాయిలున్నారంటే మీరు నమ్మగలరా? అలాగే మీరు నన్ను కోడలిగా చేసుకోడానికి సిద్ధంగా ఉన్నా నేను మటుకు అందుకు సిద్ధంగా లేను సుమండీ. మిమ్మల్ని భర్తగా పొందటమే నా కోరిక గాని మామగారిగా స్వీకరించాలనే తలంపు లేనేలేదు—ఆస్తి అంటారా? మీ తోటలూ పొలాలూ, బంగళాలు కాదు నాకు కావలసింది. అవే కావలిస్తే యింకే వృద్ధుణ్ణయినా చేసుకోవచ్చు. మీ ఆస్తి అంతా మీ పిల్లలకు రిజష్టరు చేశాకే నన్ను పెళ్ళాడండి. ఈ సంవత్సరం గడిస్తే నాకు ఉద్యోగం కాకపోదు. ఇక మీ ఉద్యోగం ఉండనే ఉందికదా— లేకపోయినా మిమ్మల్ని నా ఆర్జనతోనే పోషించగలను. నాకు కావలసినదల్లా మీ సంతతసాన్నిధ్యం, మీ సహచర్యంలో నాకు అత్యంత ప్రీతి పాత్రమైన గణితశాస్త్రంలో నేను తెలుసుకోవలసినవి ఎన్నయినా ఉన్నాయి. మీ పిల్లలు ఏమయినా అనుకుంటారంటారా? వాళ్ళకు నచ్చచెప్పటం ఏమంత కష్టంకాదు. మీ అబ్బాయి వచ్చాక నేనే మాట్లాడతాను."

"అలా కాదు కల్పనా—నీవు గనుక విష్ణుని చూస్తే నీ అభిప్రాయం తప్పక మార్చుకుంటావు. నీకు యీడైన విష్ణుకాదని నన్ను—" అంటూ లేచి బయలుదేరారు రాజశేఖరంగారు.

"అబ్బ—యింక ఆ విషయం వాదించకండీ—మీ ధోరణి చూస్తే వ్యక్తిగతంగా మీకే అభ్యంతరము లేనట్లు స్పష్టమవుతూనే ఉంది. నాకు కావలసిందీ అదే" అంటూ తుర్రున లోనికి పరుగెత్తింది.

చిత్రమైన చిలిపి పిల్ల అనుకుంటూ బైటికి నడిచారు రాజశేఖరంగారు.

• • •

"ఇంతకంటే ఏ తురకవాణ్ణి తీసుకుని లేచి పోయినా యింత బాధ పడేవాణ్ణి కాదు. కండ కావరం అనుకుని ఒక్క ఏడు పేడ్చి ఊరుకునే వాణ్ణి. ఇంద రుండగా లోకం గొడ్డుబోయినట్లు ఆ ముసలాయన్నే వరించాల్సి వచ్చిందా? దీన్నేరకం జాడ్యమంటారు?" తల బాదుకున్నాడు గోపాలరావు.

"మా పెద్దన్నయ్య యీడుంటుంది ఆయనకి. అయినా యిదేం మొండితనమో యీ పిల్లకి... చదువుకున్న పిల్లలు 'వయసు మీరినవాళ్లు వివాహాలు చేసుకోటం' అనేదాన్నే ఆక్షేపించే యీ రోజుల్లో అన్నివిధాలా యీడైన కుర్రాణ్ణి తెస్తే కాదని ముసలాయన్నే, చేసుకుంటానంటుందేమిటీ!" అని అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ తల్లి శారదాంబ.

"పైగా ఆయన చిలక్కి చెప్పినట్లు చెప్పాడు తనకొడుక్కి చేసుకుంటానన్నాడు చివరికి—యీ మొండి పీనుగ వింటేనా? ఏంచూసిందో ఆయనలో... నాకంటే పెద్దవాడికి కాళ్ళుకడిగి ఎలా కన్యధార పోసేది? దగ్గరదగ్గర ఏభైఏళ్ళే! ముగ్గురు బిడ్డల తండ్రే! ఏంబాపుకుందామని దీనికీ మొండి పట్టు?..."

"కాదని మనమంతా పట్టుబడితే మనమే యిలా బాధించామని మనమీదా, ఆయనమీదా కూడా పోలీసులకు ఉత్తరంరాసి మరీ ఆత్మహత్య చేసుకుంటానని, బెదిరిస్తోందండి!" రహస్యంగా అంది శారదాంబ.

"వాళ్ళబ్బాయి మొన్ననే వచ్చాడు. ఎలాగైనా యిద్దరూ కలుసుకునే ఏర్పాటుచేసి దీని మనసుగనక అతనివైపు మొగ్గేలాచేస్తే అతనికిచ్చి పెళ్ళిచేద్దామన్నారు శేఖరంగారు" అన్నాడు గోపాలరావు.

నిట్టూర్చి "ఆయన మంచివాడే పాపం. ఇంతకీ మన బంగారందే లోపమయితే ఆయనమటుకు ఏం చేస్తాడు? మనరాతెల్లా ఉందో" అంది దిగులుగా శారదాంబ.

• • •

"కల్పనా! ఎందుకు నన్నిలా యిరుకున పెడుతున్నావు? నేనే కనిపించానా" అన్నారు రాజశేఖరంగారు బాధగా, దీనంగా, గారాబంగా.

"నేనేం చేశానండీ? 'వనిత తనంత తా...' అన్నట్లు ఏరికోరి వరించి వస్తే బాధపెడుతున్నానా!" అంది ఆశ్చర్యంతో కల్పన.

"కాదూ మరి? విష్ణునికూడా ఒప్పించావాయె. నిన్న వచ్చి వాడు నానా కల్పనని నువ్వు చేసు

కోక తప్పదు అన్నాడు. ఏం మంత్రం వేశావో వాడికి. నువ్వు వాణ్ణి చేసుకోవాలని నే నెంతో ఆశించాను."

"విష్ణు పసివాడండీ పాపం... మీ అంత గడుసు మనిషి కాదు."

"పద్ధెనిమిదేళ్ళు వెళ్ళివెళ్ళని నీ కంటికి పాతికేళ్ళ విష్ణు పసివాడా? ఏభైఏళ్ళ నేను యువకుణ్ణా! ఏ లోకంలోంచి వస్తున్నావు కల్పనా?" అన్నా రాయన నవ్వుతూ.

"ఎందుకండీ మాటి మాటికీ మీ వయసు గుర్తు చేసుకుంటారూ? పడుచువాళ్ళను చేసుకుంటే మటుకు ఒరిగేదేమిటి?" అంది గునుపుతో కల్పన.

"నా జీవితంలో ముక్కాలు మువ్వీసం గడిచే పోయింది గదా? నే నెంతకాలం నీ సాన్నిధ్యంలో ఉండగలనంటావు కల్పనా?"

"పడుచువాళ్ళు మాత్రం ఆకస్మికంగా చావ కూడదా? నా స్నేహితురాళ్ళిద్దరు పాతికలోపు వయసు వాళ్ళనే పెళ్ళాడారు. ఇద్దరి భర్తలూ పెళ్ళిఅయిన రెండేళ్ళలోపే పోయారు సడన్‌గా- అదేమంటారు?"

"ఇదేమయినా కథ అయితే అనుకోవచ్చు పోనీ ధర్మారావుని చిన్న అరుంధతి ప్రేమించి పెళ్ళాడిందంటే కథేగదా అనుకుని సరిపెట్టు కున్నాం... కేవలం జీవితంలో జరగటం నమ్మలేని విషయం ... తాత్కాలికంగా నీ కిది సంతోష జనకమే అయినా జీవితాంతం సంతృప్తి నివ్వలేదు కల్పనా? తరువాత పొరపాటు చేశానని నీవే బాధపడతావు..."

"అదే తమరు చేస్తున్న పొరపాటు. కథలో చదివితే అద్భుతం అని ఆనందించారే కాని జీవితంలో తటస్థపడితే ఇదీ అద్భుతమే అనుకుని స్వీకరించక భయపడి వెనక్కు తగ్గుతారు దేనికి? అసంతృప్తి యువకుని చేసుకుంటేమటుకు కలగ కూడదని ఎక్కడుందీ? సందేహాలుమాని నాన్నతో మిగిలిన ఏర్పాట్లు త్వరగా చూచుకోండి. లేక పోతే మా వాళ్ళతో అన్నంతపనీ చేస్తాను..."

"ఒకవేళ మీరు యింకేదయినా అఘాయిత్యం చేస్తే నేను మిమ్మల్ని మరచిపోయి మరొకరిని చేసుకుంటాననుకుంటున్నారు కాబోలు పట్టిది. ఇంకొకరిని పెళ్ళాడటమనేది మాత్రం జరగదు. అందువల్ల నేను చెప్పినట్లు చేయండి."

"ఏం చేస్తాను? తప్పుతుందా మరి. శ్రీమతిగారి ఆజ్ఞలన్నీ అక్షరాలా నెరవేరుస్తాము" అంటూ లేచారాయన.

"మాష్టారూ. మరోమాట—దయచేసి యింకె ప్పుడూ మీ వృద్ధాప్యం సంగతి అనవసరంగా పదే పదే స్మరించకండీ... నా కంటికి మీరు చాలా వయసుగా నవమన్మథుడిలా కనిపిస్తున్నారు" అంది కల్పన ప్రేమతో.

"మోడువారిన వృక్షానికి నవవసంతాన్ని కలిగి స్తున్నావు కల్పనా! అన్ని అధ్యాయాలూ ముగిసి పోయా యనుకున్న నా జీవిత చరిత్రలో నూతనా ధ్యాయాన్ని తెరిచావు...నీత్యాగానికి నే నెంత వరకూ అర్హుణ్నో—నిన్నెంతవరకూ సుఖపెట్ట గలనో కూడా తెలీటంలేదు," ఉద్రేకంతో యీ మాట లంటూ రాజశేఖరంగారు బైటికి వెళ్ళి పోయారు.

---

తమ దేశాన్నీ, ప్రజల్నీ ఉద్ధరించేద్దామనే సదుద్దేశంతోనే అనుకుందాం— రాజకీయ నాయకులు ఎంతగా ఘర్షణ పడుతూంటారో చూడండి. కొంత నిగ్రహం, కావలసిన పరిజ్ఞానం, లేకపోతే వాళ్ళ తాపత్రయం అంతా సంఘానికి పీడగా ఉంటుంది. వాళ్ళ ఆశయాలు భ్రాంతులుగా మారిపోతాయి. ఆశయాల నిషా తలకెక్కి వాళ్ళు నిరంకుశంగా ప్రవర్తిస్తారు. "నాయకత్వం" కోసం తహతహ లాడడం ఒకజబ్బుగా పరిణమించి, సంఘానికి వాళ్ళు శత్రువులుగా తయారవు తారు. వీళ్ళని గాక, సాహిత్యం, సంగీతం, శిల్పం, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం— వీటిలో అమోఘ విజయాలు సాధించిన వారిని తలుచుకోండి. ఒంటరిగా అవి సాధించగల్గిన అటువంటి వారే సంఘానికి నిజమైన నాయకులు.—మార్టిన్ హూర్